**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

**ఫోన్ నెం : 9885315759**



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 279 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 1 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# మృత్యు విస్ఫోటం



## బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

## 20 మంది సజీవ దహనం

- మరో 10 మందికి తీవ్ర గాయాలు
- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో పెను విషాదం
- పేలుడు ధాటికి చెల్లాచెదురైన శరీర భాగాలు
- 5 కి.మీ. దూరం వరకు వినిపించిన శబ్దాలు
- సంఘటనాస్థలికి హుటాహుటిన సీఎం
- ప్రధాని మోదీ సంతాపం

- మిగతా2లో



వెలుగులు విరజిమ్మే బాణసంచా అంతులేని అంధకారం మిగిల్చింది.. వేడుకల్లో ఘనంగా పేలే మందుగుండు శ్మశాన నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టింది.. బాణసంచా తయారీలో నిర్లక్ష్యం నిండు ప్రాణాల్ని నిర్దాక్షిణ్యంగా బలిగొంది. కాళ్లూ చేతులూ తెగిపడి.. మాంసం ముద్దల్లా మారిన మృతదేహాలను చూసి బాధిత కుటుంబాల గుండె పగిలింది



## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం

- 15 ఏళ్లలోపు బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ
- ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు కీలక హామీ
- వైద్య రంగానికి బడ్జెట్‌లో 6 శాతంతో నిధుల వెల్లువ
- గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతకూ భంగం కలిగించారంటూ ఫైర్

- మిగతా2లో

# మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం

- కేంద్రం నుంచి మరో రూ.2 లక్షల సాయం
- ఆర్డీఓ, డీఎస్పీ, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారుల సస్పెన్షన్
- సీఎం చంద్రబాబు ప్రకటన
- కాకినాడ జీజీహెచ్‌లో బాధితులకు పరామర్శ
- చీకటిలోనూ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలన



కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం ఇవ్వనుందన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం రాత్రి పరామర్శించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జరిగిన ఘటన చాలా దురదృష్టకరం. బాధితులంతా బడుగు బలహీనవర్గాలకు చెందినవారే. అందులో 12 మంది ఎస్సీలు, 8 మంది మహిళలు ఉన్నారు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకుంటున్నాం. ఇటీవల ఒక ఘటన జరిగింది. దానిపై విచారణ చేసి చర్యలు తీసుకోమని ఆదేశించాం. అయినప్పటికీ మళ్లీ మరోసారి ఇటువంటివి చోటుచేసుకోవడం విచారకరం. గాయపడ్డవారికి మెరుగైన చికిత్సకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. ఇందులో ఓ భార్యా భర్త కూడా చనిపోయారు. చనిపోయినవారి పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిస్తాం' అని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో పేలుడు జరిగిన బాణసంచా పరిశ్రమ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

- మిగతా2లో




## పెట్టుబడిదారులు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు

- రాంబిల్లిలో బ్లూజెట్ హెల్త్‌కేర్ యూనిట్‌కు శంకుస్థాపన
- ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

'ఒకసారి మా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తర్వాత అది మీ ప్రాజెక్టు కాదు.. మా సొంత ప్రాజెక్టుగా భావిస్తాం. పెట్టుబడిదారులను బయట వ్యక్తుల్లా కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెంలో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్‌కు శనివారం లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఈ పరిశ్రమ ఏర్పాటు ఓ మైలురాయి. ఆధునిక ఫార్మాస్యూటికల్ రంగంలో రాష్ట్రాన్ని మరింత కీలక గమ్యస్థానంగా మారుస్తుంది.

- మిగతా2లో



## సునీల్‌కుమార్ వర్సెస్ రఘురామకృష్ణరాజు

### వ్యంగ్యాస్త్రాలు, వాగ్బాణాలతో మాటల యుద్ధం

ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ సామాజిక, ప్రసార మాధ్యమాల వేదికగా వాగ్బాణాలు, వ్యంగ్యాస్త్రాలు సంధించుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యేల క్రీడాపోటీల్లో రఘురామ క్రికెట్ ఆడుతూ కిందపడడంతో ఆయన చేతి మణికట్టుకు గాయమైంది. దానిపై సునీల్‌కుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ..

- మిగతా2లో

## భారత్-అమెరికాల వాణిజ్య ఒప్పందం రైతులకు ముప్పు



బర్నాలా: భారత్-అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగాన్ని దెబ్బతీస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. శనివారం పంజాబ్‌లోని బర్నాలాలో నిర్వహించిన మజ్దూర్ కిసాన్ మహార్యాలీలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్లకు

- మిగతా2లో



# ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్

- ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం
- ఇరాన్ రక్షణ మంత్రి, ఐఆర్‌జీ కమాండర్ సైతం హతమైనట్లు రాయిటర్స్ కథనం
- దేశాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానీయులకు ట్రంప్ పిలుపు
- పశ్చిమాసియా, గల్ఫ్‌లకు వేలకొద్దీ విమాన సర్వీసుల రద్దు

## 201 మంది మృతి.. అందులో 86 మంది విద్యార్థినులే..

పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా శనివారం అమెరికా, ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగాయి. దీనికి ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది.

- మిగతా2లో

# దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్



## అజ్‌మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

జైపూర్: దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా హ్యూమన్ ప్యాపిలోమావైరస్(హెచ్‌పీవీ)ని ఇది అరికడుతుంది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు సింగిల్ డోస్ 'గార్డాసిల్-4' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది.

# మృత్యు విస్ఫోటం

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం పెను విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం జరిగి 20 మంది సజీవ దహనమయ్యారు. తీవ్ర గాయాలపాలైన మరో పది మందిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)కి తరలించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. పేలుళ్ల ధాటికి అందులో పనిచేస్తున్న కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురైపోయాయి. కాళ్లు, చేతులు తెగి సమీపంలో ఉన్న చెట్లపై పడడంతో ఆ ప్రాంతమంతా భీతావహ పరిస్థితి నెలకొంది. చనిపోయిందెవరో గుర్తుపట్టలేనంతగా మృతదేహాలున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 70 శాతానికిపైగా కాలిన గాయాలతో ఉన్న 9 మందిని జీజీహెచ్‌కు, మరొకరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారందరి పరిస్థితీ విషమంగానే ఉంది.

**కళ్లముందే కాలిపోతున్నా ఆపలేక..**

ఘటనా స్థలంలో పనిచేస్తున్న వ్యక్తులు బయటకు రాలేక కళ్లముందే కాలిపోతున్నా వారిని కాపాడే పరిస్థితి లేకపోయింది. ఒక్కపక్క ఎగసిపడుతున్న మంటలు, మరోవైపు భారీ పొగతో ఏం జరుగుతుందో, మంటల్లో ఎంతమంది ఉన్నారో అంచనా వేయలేని స్థితి నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను కొంతమేర అదుపులోకి తెచ్చిన తరువాత తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న 10 మందిని గుర్తించి అంబులెన్స్‌ల్లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాణసంచా ముడిసరకు నిల్వలు భారీ ఎత్తున ఉండటంతో మంటలు సుమారు రెండుగంటలకు పైగా మండుతూనే ఉన్నాయి. ఆ ప్రదేశం మొత్తం పొగ కమ్మేయడం, వరుస పేలుళ్లతో అసలు ఏం జరుగుతుందో తెలియనంత గందరగోళం నెలకొంది.

**గాల్లో ఎగిరిపడ్డ శరీర భాగాలు**

పేలుడు ధాటికి అక్కడ పనిచేస్తున్న పలువురి శరీర భాగాలు గాలిలో ఎగిరిపడ్డాయి. ఒక మహిళ పుర్రె భాగం పేలిపోయింది. మరో మృతదేహం పేలిపోయి మాంసం ముద్దగా పక్కనే ఉన్న పొలంలో ఎగిరిపడింది. మరో వ్యక్తి మృతదేహం సుమారు 50 మీటర్ల దూరం ఎగిరి పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోయింది. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఘటనా స్థలంలో కాళ్లూ, చేతులూ, ఇతర శరీరభాగాలు విడిపోయి, చెల్లాచెదురుగా పడి ఉండడంతో భీతావహ వాతావరణం నెలకొంది. ఇంతటి దారుణం ఎప్పుడూ చూడలేదని స్థానికులు విలవిల్లాడిపోయారు.

**మృతదేహాల కోసం పొలాల్లో వెతుకులాట**

సుమారు ఎకరన్నర ప్రాంతంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. షెడ్లలో పని చేసేవారు అక్కడకక్కడే చనిపోయి కాలిపోయి పడి ఉండగా మరికొందరు గాయాలతో ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో పంట పొలాల వెంట పరుగులు తీశారు. కొందరు పొలాల్లోనే కుప్పకూలి మృతి చెందారు. చనిపోయింది ఎవరో తెలియడానికి, వారి మృతదేహాలు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవడానికే సాయంత్రమైంది. పంట పొలాలు, కాలువలు, ఘటనా స్థలంలో ఉన్న మృతదేహాలన్నీ ఒకచోటకు చేర్చారు. 20 మంది మృతి చెందారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**పచ్చని పొలాల్లో భారీ పేలుడు**

వేట్లపాలేనికి సమీపంలోని పంట పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరుతో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. స్థానికులు టపాసుల తయారీ పనులు చేస్తుండగా మధ్యాహ్నం 2 గంటల వేళ భారీ పేలుడు చోటుచేసుకుంది. ఆ శబ్దానికి సమీప గ్రామాల్లో ఇళ్లు కంపించాయి. పైకప్పు పెంకులు ఎగిరిపడ్డాయి. ఇళ్లలో సీలింగ్‌లు ఊడిపడ్డాయి. ఐదు కిలోమీటర్ల దూరంలోని సామర్లకోట, పెద్దాపురం ప్రజలకూ శబ్దాలు వినిపించాయంటే పేలుళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

**మృతులు వీరే..**

గండి మంగ (36), వల్లూరి రవి (35), కడింపల్లి కృపామణి (50), బిక్కిన కరుణ సుబ్బారావు (45), సాధనాల సత్యవేణి (44), గొడత నాని (26), తుంపాల లోవ (38), చింతల రమణమ్మ (60), మందపల్లి చిన్ని (44), గొడత మహేష్ (41), నూకళ్ల దేవి (45), గొడత వీరవెంకటరమణ (48), కడింపల్లి ధనరాజు (55), సాకుమళ్ల రాఘవ (50), అడబాల శ్రీనివాసరావు (55)(వేట్లపాలెం).. దర్శిపాటి నాని (38), ఏడిద సంపత్ కుమార్ (25) (సామర్లకోట), మకర రాఘవమ్మ (55) (పెదబ్రహ్మదేవం), గంపల మంగమ్మ(45), గంపల నాగరాజు(57)

**కాకినాడ జీజీహెచ్‌లో 9 మంది క్షతగాత్రులు**

**90 శాతానికి పైగా కాలిన గాయాలు.. విషమంగా పరిస్థితి**

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన 9 మంది క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ ట్రామాకేర్, అత్యవసర విభాగాల్లో వారికి వైద్యసేవలు అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో 8 మందికి 90 శాతానికి పైగా, ఒకరికి 70 శాతానికి పైగా కాలిన గాయాలైనట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందితో పాటు ఔషధాలను, అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో ఉంచామన్నారు. బాధితుల సమాచారం తెలియజేసేందుకు ఆసుపత్రిలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ ఆసుపత్రికి వచ్చి బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీ, జేసీ అపూర్వభరత్ తదితరులు ఆసుపత్రిలో వైద్యసేవలను పర్యవేక్షించి బాధితులను పరామర్శించారు.

# ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అగ్రరాజ్యం చేపట్టిన ఈ దాడులతో దేశమంతా అట్టుడికింది. ఈ దాడుల్లో ఇరాన్ రక్షణశాఖ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహమ్మద్ పాక్‌పౌర్ మృతి చెందినట్లు రాయిటర్స్ పేర్కొంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దక్షిణ ఇరాన్‌లోని ఓ పాఠశాలపై బాంబులు పడటంతో 86 మంది విద్యార్థినులు మరణించారు. వారితోపాటు ఇరాన్‌లో మొత్తం 201 మంది మరణించారు. 747 మంది గాయపడ్డారని రెడ్ క్రెసెంట్ వెల్లడించింది. ఇరాన్ ప్రతి దాడుల కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) ఒకరు మృతి చెందారు. ఇజ్రాయెల్‌లో 94 మంది స్వల్పంగా గాయపడ్డారు. యుద్ధం మొదలు కావడంతో పశ్చిమాసియాకు వేలకొద్దీ విమానాలు రద్దయ్యాయి. దేశాన్ని 1979 నుంచి పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వం నుంచి మీ దేశాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రజలు తమ తలరాతను తామ చేతుల్లోకి తీసుకునేందుకు ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. దేశం ఇటువంటి దాడులను ఉపేక్షించబోదని, దేశాన్ని రక్షించుకునే సమయం వచ్చిందని, శత్రువు సైన్యాన్ని ఎదుర్కొనే అవకాశం వచ్చిందని ఇరాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. రెండు పక్షాలు సమన్వయం పాటించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. యుద్ధాన్ని విరమించి, చర్చలు జరపాలని భారతదేశం పిలుపునిచ్చింది.

**పగలే అమెరికా దాడులు..**

గతానికి భిన్నంగా ఈసారి పగటి వెలుగులోనే అమెరికా దాడులకు దిగింది. శుక్రవారం వారాంతపు సెలవు అనంతరం ఇరాన్‌లో లక్షల మంది శనివారం ఉదయం యథావిధిగా పనులకు, పాఠశాలలకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.27 గంటల సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగాయి. తొలుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఇళ్లు, కార్యాలయాల చుట్టుపక్కల దాడులు జరిగాయి. దీంతో టెహ్రాన్ వ్యాపార కేంద్రంలోని ఖమేనీ ప్రాంగణానికి వెళ్లే దారులన్నింటినీ మూసివేశారు. ఆ తర్వాత దేశమంతా బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ సైన్యం, ప్రభుత్వ, నిఘా కార్యాలయాలపై దాడులు జరిగాయి. 8 నెలల్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగడం ఇది రెండోసారి.

కెర్మన్‌షా, ఖోమ్, తబ్రీజ్, ఇస్ఫహాన్, ఇలాం, కరజ్ ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ హార్మోజ్‌గన్ ప్రావిన్సులోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై అమెరికా బాంబులు పడ్డాయి. ఈ ఘటనలో 86 మంది విద్యార్థినులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ప్రాంతంలో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ స్థావరం ఉంది.

ఉత్తర టెహ్రాన్‌లోని 30 ప్రాంతాల్లో ఒకేసారి ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్ష భవనం, కీలక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే ఈ దాడులు జరిగాయి. ఆ సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని, అప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సైతం సురక్షితంగా ఉన్నట్లు టెహ్రాన్ మీడియా వెల్లడించింది.

ఖమేనీ, పెజెష్కియాన్ సురక్షితంగానే ఉన్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ధ్రువీకరించారు. అమెరికా దాడులు అక్రమమని, అన్యాయమని, రెచ్చగొట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు.

శనివారం సాయంత్రం టెహ్రాన్‌లోని నిఘా కార్యాలయం సమీపంలో 3 పేలుళ్లు సంభవించాయి.

200 యుద్ధ విమానాలతో ఇరాన్‌లోని 500 లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

**తీవ్రంగా స్పందించిన ఇరాన్**

అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసిన కొద్ది గంటల తర్వాత ఇరాన్ స్పందించింది. తొలుత ఇజ్రాయెల్‌పై 200కుపైగా డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. అందులో 35 ఇజ్రాయెల్ గగనతలంలోకి ప్రవేశించాయి. ఈ దాడుల్లో 94 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆ తర్వాత బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈసహా 7 దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్, యూఏఈ, ఇరాక్‌తోపాటు పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి.

బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ దాడులు జరిపింది. మనామాలోని బహుళ అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకుంది.

కువైట్‌లోని అల్ సలేం అమెరికా ఆర్మీ సెంట్రల్‌పై ఇరాన్ విరుచుకుపడింది.

ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణులు పేల్చింది.

యూఏఈలోని అల్-ధఫ్రా ఎయిర్‌బేస్‌పై దాడులు చేసింది. దుబాయ్‌లో గగనతల రక్షణ వ్యవస్థను మోహరించారు. బాంబు ముక్క ఒకటి పడటంతో దుబాయ్‌లో ఒకరు మరణించారు. ప్రఖ్యాత పామ్ జుమేరియా ప్రాంతంలోనిఅంతర్జాతీయ పర్యాటకుల హోటల్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు.

జోర్డాన్‌లోని కింగ్ హుసేన్ వైమానిక స్థావరాన్నీ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.

తమ దేశంలోని రియాద్‌పై ఇరాన్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా ఖండించింది.

ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హూతీ రెబల్స్.. ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులకు దిగారు. ఇజ్రాయెల్‌పైనా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించారు.

ఖతార్, యూఏఈ, ఇజ్రాయెల్‌లలోని అమెరికా ఎంబసీల్లో సిబ్బందిని షెల్టర్లకు వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

# మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం

-మొదటిపేజీ తరువాయి

**నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు**

'బాణసంచా తయారీలో వాడే సామగ్రి చాలా ప్రమాదకరమైనది. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం. సాంకేతికంగానూ దీనిపై విచారణ జరగాలి. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఆర్డీవో, డీఎస్పీ, జిల్లా కార్మికశాఖ అధికారి, అగ్నిమాపకశాఖ అధికారిని సస్పెండ్ చేస్తున్నాం. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తాం. మిగిలిన బాధ్యులపైనా చర్యలు ఉంటాయి. సంబంధిత యజమాని ఎక్కడ ఉన్నా పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం. అవసరమైతే ఆయన ఆస్తులు జప్తు చేసి, బాధితులకు అందజేస్తాం. బాధితుల్లో చాలామంది తమకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నామని తెలిపారు. రోజుకు రూ.700 వస్తుందని, అదే ఉపాధి పనిలో రూ.300 మాత్రమే వస్తుందని చెబుతున్నారు. 'నరేగాలో 125 రోజులు పని కల్పిస్తున్నాం. ఈ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ చేయిస్తాం' అని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, కందుల దుర్గేష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు సానా సతీష్, ఉదయశ్రీనివాస్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

**ప్రొటోకాల్ పక్కనపెట్టి..**

వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటన సమాచారం తెలిసిన వెంటనే.. విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రత్యేక దళాల భద్రత మధ్య బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో పర్యటనలు సాగించే సీఎం సామర్లకోట చేరుకున్న వెంటనే అందుబాటులో ఉన్న కలెక్టర్ వాహనంలో మామూలు భద్రత మధ్య మట్టిరోడ్డుపై ఘటనా స్థలానికి వెళ్లారు. పేలుడు జరిగిన ప్రాంతంలో అప్పటికే చీకటిపడినా, అక్కడక్కడా ఉన్న విద్యుద్దీపాల వెలుగులో బురదలోనూ నడుచుకుంటూ వెళ్లి తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం కాకికాడ జీజీహెచ్‌కు వెళ్లారు. వ్యవసాయ పనులు సరిగా లేకపోవడంతో బాణసంచా తయారీకి కూలీలుగా వెళ్తున్నామని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని బాధిత కుటుంబాలవారు సీఎంను కోరారు.

**దురదృష్టకరం: మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు**

వేట్లపాలెంలో బాణసంచా పేలుడు జరిగి 20 మంది చనిపోవడం అత్యంత బాధాకరం. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి బాణసంచా తయారీ, నిల్వలు ఉండడమే ప్రమాద తీవ్రతకు కారణంగా తెలుస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి.

**విమానాశ్రయంలో ఎదురుపడిన సీఎం, డిప్యూటీ సీఎం**

రాజమహేంద్రవరం విమానాశ్రయంలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరస్పరం ఎదురయ్యారు. కాకినాడలో బాధిత కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత సీఎం అమరావతికి పయనమయ్యారు. అదే సమయంలో కాకినాడలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ ఘటనపై ఇద్దరూ అక్కడే చర్చించుకున్నారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు.

## దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

'కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లింలీగ్- మావోయిస్టు కాంగ్రెస్'గా మారింది'

అజ్మేర్‌లో కాంగ్రెస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ఇప్పుడు ముస్లిం లీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌గా మారిందని విమర్శించారు. ముస్లిం లీగ్‌కు భారత్‌పై ఉన్న ద్వేషమే నాడు విభజనకు కారణమైందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ యువజన విభాగం చేసిన అర్ధనగ్న నిరసనపై మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కించపరచడానికి దొరికిన ఏ అవకాశాన్నీ కాంగ్రెస్ వదులుకోదని మండిపడ్డారు. ప్రపంచం భారత్‌ని ప్రశంసించినప్పుడు, భారతీయులంతా గర్వపడితే.. కాంగ్రెస్ మాత్రం దేశాన్ని కించపరిచే ప్రయత్నాలు చేస్తుంటుందన్నారు. దేశవ్యాప్త ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా ఓడిపోతూ వస్తోందని, అందుకే దేశాన్ని దిగజార్చే ప్రయత్నాలు చేస్తూ ప్రతీకారం తీర్చుకుంటోందని మోదీ అన్నారు.

## భారత్-అమెరికాల వాణిజ్య ఒప్పందం రైతులకు ముప్పు

-మొదటిపేజీ తరువాయి

అనుకూ లంగా మార్చే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. 'ప్రధాని నాలుగు నెలలుగా చేయని పనిని, 15 నిమిషాల్లో ఎలా చేశారు? ఆకస్మికంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఏటా అమెరికా నుంచి సుమారు రూ.తొమ్మిది లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్‌నకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది దేశ రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకం గురించి మాట్లాడాలని అనుకున్నానని, కానీ, అవకాశం ఇవ్వలేదని రాహుల్ తెలిపారు. అలాగే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతకు సంబంధించి కేంద్రం వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలని రాహుల్ 'ఎక్స్' వేదికగా కోరారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ఈసీహెచ్‌ఎస్)కు నిధులు కేటాయించడంతో పాటు వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు రాహుల్ తెలిపారు.

## సునీల్‌కుమార్ వర్సెస్ రఘురామకృష్ణరాజు

-మొదటిపేజీ తరువాయి

'కస్టోడియల్ టార్చర్ కథ అబద్ధం.. ఆటలో పడిపోతేనే రెండు ఎముకలు విరిగే వ్యక్తిని నిజంగా కొట్టి ఉంటే? ఎన్ని ఎముకలు విరిగేవి అధ్యక్షా' అంటూ వ్యంగ్యంగా ప్రకటన చేశారు.దీనిపై రఘురామ ఘాటుగా స్పందించారు..'సర్వీస్ కాల సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ ఒప్పుకొంటే అరగంట చాలు.. కస్టడీలో నన్ను కొట్టినట్లుగా ఎముకలు విరక్కుండా కాళ్లు కట్టేసి పాదాలపై కర్ర, రబ్బర్ బెల్ట్‌తో రక్తపు చారల మచ్చలు పడేలా కొట్టగలను.. సునీల్‌కుమార్ వచ్చి, కొట్టించుకుని, నిరూపించుకుంటాను అంటే బహిరంగంగానే ఈ కార్యక్రమం పెడతా' అంటూ శనివారం ఒక ప్రకటనలో సవాల్ చేశారు. 'న్యాయవ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. నాపై కస్టోడియల్ హింసకు పాల్పడిన సునీల్‌కుమార్ అరెస్ట్ తథ్యం' అని ఆయన హెచ్చరించారు. ఆ వెంటనే.. ఈ ప్రకటనతో ఆర్‌ఆర్‌ఆర్ సెల్ఫ్‌గోల్ అంటూ సునీల్ కుమార్ ఒక వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్‌లో పెట్టారు. 'ఏ కేసులో ఎవరేమవుతారని చెప్పేందుకు మీరెవరు? మీ ఈగోని సంతృప్తి పరిచేందుకే దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి' అని ఆరోపించారు.

## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నామని, ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ... క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు.మహిళల్లో అత్యధికంగా వస్తున్న సర్వైకల్ క్యాన్సర్‌ను అరికట్టేందుకు 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ టీకాలను ఉచితంగా అందిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. బయట మార్కెట్లో రూ.4 వేలు ఉండే ఈ టీకాను, రాష్ట్రంలోని 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా అందించేందుకు రూ.14.11 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కర్నూలులో రూ.50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నామని, తాజా బడ్జెట్‌లో వైద్య రంగానికి ఏకంగా రూ.19,305 కోట్లు కేటాయించామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం కీలక ప్రకటన చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, ప్రతి ఎకరానికి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖలో డేటా సెంటర్ల రాకతో ఈ ప్రాంత ముఖచిత్రం మారిపోనుందని చెప్పారు.గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత పాలకులు ప్రజలనే కాకుండా దేవుడిని కూడా మోసం చేశారని, తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా భూములు కాజేయాలని చూస్తే, తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ' ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## పెట్టుబడిదారులు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు

బ్లూ జెట్ హెల్త్‌కేర్ సంస్థ రూ.2,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమతో 1750 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళు తుంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**మాటిస్తే నిలబెట్టుకుంటాం**

'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత ఉంది. మన రాష్ట్రం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. అదే మన బలం. రాష్ట్రానికి ప్రాజెక్టులు వస్తే.. కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన గ్రౌండింగ్ అవుతున్నాయి. బ్లూజెట్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం కోసం అతి తక్కువ కాలంలోనే రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో 102 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ త్వరితగతిన అందించాం' అని లోకేశ్ తెలిపారు. బ్లూజెట్ హెల్త్ కేర్ యూనిట్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మంత్రి రవీంద్ర, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, పరిశ్రమ ప్రతినిధులు

**పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా ఉత్తరాంధ్ర**

'ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్, టీసీఎస్, కాగ్నిజెంట్ ఐటీ పెట్టుబడులతో ఉత్తరాంధ్ర పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా మారుతోంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ఫార్మాస్యూటికల్స్, మెడికల్ ఉపకరణాలు, పెట్రోకెమికల్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతాన్ని ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. విశాఖ పోర్టు ద్వారా కనెక్టివిటీ, విస్తారమైన భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన మానవవనరులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి బలం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బ్లూజెట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అక్షయ్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ వార్ ఎఫెక్ట్ తో పసిడి కి భారీ పెరుగుదల తప్పదా..?




**బిజినెస్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 28:**పశ్చిమాసియాలో ముదురుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఇరాన్ పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేయడం, దానికి ఇరాన్ ప్రతిదాడులు చేయడం పరిస్థితులను ఆందోళనకరంగా మార్చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ముదురుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఇరాన్ పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేయడం, దానికి ఇరాన్ ప్రతిదాడులు చేయడం పరిస్థితులను ఆందోళనకరంగా మార్చేస్తున్నాయి. ఈ యుద్ధ ప్రభావం నేరుగా కమోడిటీ మార్కెట్ పై పడనుంది. కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే యుద్ధ ప్రభావం కారణంగా బంగారం, వెండి ధరల్లో భారీ పెరుగుదల నమోదైంది.

ప్రస్తుతం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,68,710కి చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే పది గ్రాములకు ఏకంగా రూ.7,140 మేర పెరిగింది. అలాగే 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,54,360కి చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే పది గ్రాములకు ఏకంగా రూ.6,530 మేర పెరిగింది. మరో వైపు వెండి ధర కిలోకు పది వేల రూపాయల మేర పెరిగి ప్రస్తుతం రూ.2.95 లక్షలుగా ఉంది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం.. మార్చి తొలి వారానికి బంగారం ప్రస్తుత ధరతో పోల్చుకుంటే 15 శాతం మేర పెరిగే అవకాశాలు కనబడుతున్నాయి. అంటే దాదాపు రూ.23 వేల నుంచి 25 వేల వరకు పెరగొచ్చు. సోమవారం మార్కెట్ ప్రారంభం కాగానే బంగారం ధరలో 10 శాతం పెరుగుదల ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే పది గ్రాముల బంగారం ధర తిరిగి రూ.2 లక్షలకు చేరువ అవుతుందని భావిస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా పెరగనున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం కిలో వెండి స్వల్ప కాలంలో ప్రస్తుత ధరతో పోల్చుకుంటే రూ.30 నుంచి 50 వేల వరకు పెరగొచ్చు. యుద్ధం ఎంతకాలం కొనసాగితే, ధరల పెరుగుదల అంత తీవ్రంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. వెండి తిరిగి తన చారిత్రాత్మక గరిష్ఠ స్థాయిలను దాటి రూ.4.2 లక్షలకు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# టీటీడీ వార్షిక బడ్జెట్‌కు ఆమోదం.






**తిరుమల, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శనివారం తిరుమల లోని అన్నమయ్య భవనంలో జరిగింది. ఈ సమావేశానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మొత్తం 87 కీలక అంశాల పై ధర్మకర్తల మండలి సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. సుమారు నాలుగు గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశంలో ప్రధానంగా టీటీడీ వార్షిక బడ్జెట్, భక్తులకు అందించే సేవలు, ఆలయ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలు, భవిష్యత్ ప్రణాళికల పై చర్చించారు. 2026 - 2027 వ సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. రూ.5,456.26 కోట్ల తో వార్షిక బడ్జెట్ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ సందర్భంగా టీటీడీ పాలకమండలి నిర్ణయాలను బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సబ్ కమిటీ సిపారస్సు మేరకు టీటీడీ లోని విద్యా సంస్థల ఆధునీకరణకు రూ.118.8 కోట్ల నిధులు కేటాయించామని వివరించారు. భక్తుల కోరిక మేరకు శ్రీవారి ముడుపు పథకం ప్రారంభిస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ సహకారంతో రూ.125 కోట్లతో అధునాతన అన్నదాన సముదాయన్ని నిర్మిస్తామని బీఆర్ నాయుడు తెలిపారు. హుండీ ద్వారా రూ.1,880 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నామని అన్నారు. వడ్డీల ద్వారా రూ.1,205 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.650 కోట్లు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.310 కోట్లు, జీతాల చెల్లింపునకు రూ.1,859.75 కోట్లు, ముడిసరుకుల కొనుగోలుకు రూ.974.50 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు రూ.700 కోట్లు, ఇంజనీరింగ్ పనులకు రూ.475 కోట్లు కేటాయింపులు చేశామని ప్రకటించారు. శ్రీవాణి ట్రస్టు లోని నిబంధనలను సడలించి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు. ఒంటి మిట్టలో 128 అడుగుల జాంబవంతుడు విగ్రహాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. పాట్నా, గౌహతితో పాటు పలు చోట్ల నూతనంగా వేంకటేశ్వర స్వామి ఆలయాలు నిర్మిస్తామని తెలిపారు. 'అక్షర గోవిందం' పేరుతో వకుళమాత ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని వివరించారు. ఏప్రిల్ 1 వ తేదీన శ్రీరాముని కల్యాణం నాడు 70 వేల శ్రీవారి లడ్డూలను ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రూ.4.25 కోట్లతో ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. తిరుపతి, తిరుమలలో 727 మంది భద్రతా సిబ్బందిని నియమిస్తామని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు. రూ.8 కోట్లతో అలిపిరి తనిఖీ కేంద్రంలో నూతనంగా స్కానింగ్ యంత్రాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.11.28 కోట్లతో టీటీడీ లోని గోశాలల ఆధునికీకరణ చేస్తున్నామని అన్నారు. 51 మంది టీటీడీ పరిచారకులకు అర్చకులుగా పదోన్నతికి ప్రతిపాదన చేస్తున్నామని అన్నారు. పార్వతీపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.14.25 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. గోవిందరాజ స్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామన్నారు. రూ.10.73 కోట్లతో తిరుపతిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుమలలో రీల్స్ చేసే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని బీఆర్ నాయుడు హెచ్చరించారు. అంతకు ముందు తిరుమల వరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని, ఒంటిమిట్ట బ్రహ్మోత్సవం పోస్టర్ ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విడుదల చేశారు.

# టోల్ గేట్లకు గుడ్ బై, ఇక పై స్మార్ట్ టోల్ వసూళ్లు



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 28:**హైవే పై ఎంత వేగంగా ప్రయాణించినా టోల్ ప్లాజా దగ్గర మాత్రం బ్రేక్ వేయాల్సిందే. ఫాస్టాగ్ ఉన్నా, సిగ్నల్ గ్రీన్ అవ్వాలి, బారియర్ పైకి లేవాలి అప్పుడే ముందు కెళ్లాలి. పండగలప్పుడు, వీకెండ్ లలో అయితే టోల్ క్యూల్లో గడిపే సమయం ప్రయాణానికంటే ఎక్కువగా అనిపించే సందర్భాలు ఉంటాయి. ఈ అసౌకర్యానికి ముగింపు పలకాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పెద్ద నిర్ణయం తీసుకుంది. ఇక పై వాహనం ఆపకుండానే టోల్ కట్టే మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (మ్లఫ్) విధానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఆగకుండా టోల్ చెల్లింపు... ఎలా సాధ్యం?, ఈ వ్యవస్థలో టోల్ బూత్ లు, బారియర్లు ఉండవు, ప్లాజా పైన ఏర్పాటు చేసే గ్యాంట్రీల పై అధునాతన సాంకేతిక పరికరాలు అమర్చుతారు. వాహనం టోల్ ప్రాంతానికి చేరుకునేలోపే కెమెరా నంబర్ ప్లేట్ ను గుర్తిస్తుంది. అదే సమయంలో ఫాస్టాగ్ స్కాన్ అయి, టోల్ ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. ఈ ప్రక్రియ మొత్తం వాహనం వేగం తగ్గించకుండానే పూర్తవుతుంది. కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారిలో విజయవాడ–గుంటూరు మధ్య ఉన్న కాజ టోల్ ప్లాజా లో ఈ విధానం అమలు చేయనున్నారు. అలాగే విజయవాడ బైపాస్‌లో వెంకటపాలెం సమీపం లోని టోల్‌ప్లాజాలో కూడా ఇదే విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఉన్న బూత్ లు, బారియర్లు దశలవారీగా తొలగించనున్నారు. ఫాస్టాగ్ లేని వాహనాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తారు. అక్కడ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. అయితే సాధారణ టోల్ రుసుము పై అదనంగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. నగదు చెల్లింపునకు కూడా అవకాశం ఉంటుంది. కానీ ఆ సందర్భంలో టోల్ మొత్తానికి రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. దీని ఉద్దేశం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం. విజయవాడ నుంచి చిలకలూరిపేట వరకు సుమారు 69.4 కిలో మీటర్ల మేర ఉన్న హైవే సెక్షన్‌లో ప్రజలు పెట్టుబడులు పెట్టే విధంగా ప్రత్యేక నమూనా రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని హైవేల్లో 'టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్' (టిఓటి) విధానం అమల్లో ఉంది. 15 ఏళ్లలో వచ్చే టోల్ ఆదాయాన్ని ముందుగానే అంచనా వేసి, ఆ మొత్తాన్ని చెల్లించే సంస్థలకు నిర్వహణ హక్కులు ఇస్తారు. ఇప్పుడు 'పబ్లిక్ ఇన్విట్' రూపంలో ప్రజల నుంచే పెట్టుబడులు సమీకరించి, టోల్ ఆదాయంలో లాభాలను పంచే విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఐదు సెక్షన్లలో ఈ మార్గం కూడా ఒకటి.

## రంగంలోకి పాకిస్థాన్.. సౌదీకు సపోర్ట్ గా



**ఇంటర్నెట్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్ పై దాడిని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా, గల్ఫ్ దేశాలకు తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతలు పెరుగుతుండగా.. సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలకు పాకిస్తాన్ పూర్తి మద్దతును ఇచ్చింది. ఇస్లామాబాద్, రియాద్‌ల మధ్య ఉన్న కీలక ద్వైపాక్షిక భద్రతా ఒప్పందమే ఈ వైఖరికి కారణం. దీని ప్రకారం, ఒక దేశం పై దాడిని రెండు దేశాల పై జరిగినట్లు భావిస్తారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ తో మాట్లాడి, ప్రస్తుత పరిస్థితుల పై పాకిస్తాన్ వైఖరిని స్పష్టం చేశారు. తన ఎక్స్ లో ఆయన ఇలా పోస్ట్ చేస్తూ, నా ప్రియ సోదరుడు మహ్మద్ బిన్ సల్మాన్‌తో మాట్లాడాను. ఇస్రాయెల్.. ఇరాన్ పై దాడి, గల్ఫ్ ప్రాంతంలో దాడుల వల్ల తలెత్తిన ప్రమాదకర ఉద్రిక్తతను పాకిస్తాన్ తీవ్రంగా ఖండిస్తోంది అని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో సౌదీ అరేబియా రాజ్యం, సోదర గల్ఫ్ దేశాలతో పాకిస్తాన్ పూర్తి సంఘీభావం తెలియజేస్తోంది అని షరీఫ్ తెలిపారు. శాంతి స్థాపనలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి తమ దేశం సిద్ధంగా ఉందని, రంజాన్ మాసం ఈ ప్రాంతానికి ప్రశాంతత, స్థిరత్వాన్ని తెస్తుందని ఆశించారు. సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ ప్రకారం తాజాగా ఇరాన్, సౌదీ రాజధాని రియాద్, తూర్పు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఈ చర్యను రియాద్ నిస్సిగ్గు, పిరికిపంద చర్యగా అభివర్ణించగా, తమ వైమానిక రక్షణ వ్యవస్థలు దాన్ని విజయవంతంగా తిప్పికొట్టాయని సౌదీ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు.. ఇరాన్ పై దాడులు ప్రారంభించడంతో మధ్యప్రాచ్యంలో పూర్తి స్థాయి సంఘర్షణ చెలరేగింది. దీనికి ప్రతిగా, టెహ్రాన్, మిత్రులు హిజ్బుల్లా, హౌతీలు టెల్ అవివ్, కువైట్, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లోని అమెరికన్ స్థావరాలపై క్షిపణులు ప్రయోగించారు. ఈ దాడుల వల్ల దుబాయ్, అబుదాబిలో పేలుళ్లు సంభవించి, క్షిపణుల అడ్డగింత తర్వాత పడిన శిథిలాల వల్ల ఒక ఆసియా జాతీయుడు మరణించాడు.షరీఫ్ మద్దతు.. గత సంవత్సరంలో రియాద్‌లో పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య కుదిరిన 'వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం' తర్వాత వచ్చింది. ఈ ఒప్పందం కింద, ఏ దేశంపై దాడి జరిగినా అది రెండు దేశాలపై జరిగినట్లు పరిగణించబడుతుంది. అవసరమైతే, సౌదీ అరేబియా రక్షణలో పాకిస్తాన్ అణు ఆయుధాగారాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి ఈ ఒప్పందం చట్టబద్ధంగా అనుమతిస్తుంది. ఈ సంయుక్త రక్షణ వైఖరి భద్రతా సంబంధాలను బలోపేతం చేసి, బాహ్య బెదిరింపులకు వ్యతిరేకంగా పటిష్ట నిరోధాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ధర్మసాగర్ ప్రైస్ అండ్ గ్లోరీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



**పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** ప్రైస్ అండ్ గ్లోరీ కరస్పాండెంట్ బాల ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవమును నిర్వహించినారు.పాఠశాల విద్యార్థులతో కరస్పాండెంట్ బాల ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, నేడు జాతీయ సైన్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం మనం ఫిబ్రవరి 28వ తారీఖున అంగరంగ వైభవంగా జరుపుకుంటాం.ఈ సైన్సు దినోత్సవ జరుపుకోవడానికి ముఖ్యమైన కర్త భారతదేశ భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ 1928లో రామన్ ఎఫెక్ట్ కనుగొన్నందుకు గుర్తుగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సి.వి.రామన్ తన ఆవిష్కరణకు 1930లో భౌతిక శాస్త్రంలో నవల బహుమతిని అందుకున్నారు.విద్యార్థులైన మీరు ఈ పాఠశాలలో అధ్యాపకులు చెప్పే అంశములను గ్రహించి మీ సృజనాత్మకతతో చదువులో రాణించాలని, మీరందరూ నేటి బాలలే రేపటి పౌరులు, బావి భారత నిర్మాతలు ,నిర్నేతలు, చదువుకు ప్రాధాన్యత ఇచ్చి రాబోవు కాలంలో మీరందరూ ఎవరెస్టు శిఖరం అంత ఎత్తుకు ఎదగాలని, మీలో దాగి ఉన్న సృజనాత్మకత ద్వారా ఈ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిట్స్ మీరు సొంతంగా మీ చేతుల మీదుగా చేయడం ఎంతో సంతోషదాయకం.రాబోయే రోజులు లో మరింత సైన్స్ ప్రయోగాల ద్వారా రావాలని విద్యార్థులను కోరారు.విద్యార్థులు చేసినటువంటి సైన్స్ ఎగ్జిబిట్కు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదములు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ల్వంచ బాత్రూంలో ప్రసవం చేసిన ఇంటర్ విద్యార్థిని.

- పరీక్షా కేంద్రంలో సంచలనం...




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 28:,**పాల్వంచలో జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చిన 16 ఏళ్ల విద్యార్థిని పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే కడుపునొప్పి ఉందని చెప్పి బాత్రూంకి వెళ్లింది. చాలా సేపటికీ బయటకు రాకపోవడంతో మహిళా ఇన్విజిలేటర్‌కు అనుమానం వచ్చింది.

సిబ్బంది బాత్రూం తలుపు తెరిచి చూడగా అక్కడే ఆమె మృత శిశువుకు జన్మనిచ్చినట్టు గుర్తించారు. సమాచారం ప్రకారం, శిశువు మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా బేసిన్‌లో దాచినట్టు తెలుస్తోంది. ఘటన తెలిసిన వెంటనే పరీక్షా కేంద్రంలో ఆందోళన వాతావరణం నెలకొంది.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని సమాచారం.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిని గర్భవతిగా ఉన్న విషయం కుటుంబ సభ్యులకు తెలుసా? ఈ పరిస్థితి ఎలా ఏర్పడింది? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.స్థానికంగా ఈ సంఘటన పెద్ద చర్చనీయాంశమైంది.

# ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తాం లోకేష్.

- ★ ప్రపంచం లోనే సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా ఏయూని తీర్చిదిద్దుతాం.
- ★ శతాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయండి.
- ★ ఏయూ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ పై సమీక్షలో మంత్రి నారా లోకేష్ ఆదేశం.





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తామని, శతాబ్ది ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించేందుకు అవసర మైన అన్ని ఏర్పాట్లు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ పై యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులతో విశాఖలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీకి ఎంతో ఘన మైన చరిత్ర ఉంది. యూనివర్సిటీని ప్రపంచం లోనే సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా తీర్చిదిద్దేందుకు శతాబ్ది ఉత్సవాలు వేదిక కావాలి. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వ తేదీ వరకు పూర్వ విద్యార్థులతో మమేకం కావడంతో పాటు శతాబ్ది ఉత్సవాల్లో వారిని భాగస్వాములను చేయాలి. శతాబ్ది ఉత్సవాల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఘన చరిత్ర ప్రతిబింబించాలి. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. కమిటీలను సమన్వయం చేసుకోవాలి. మీడియా పబ్లిసిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి కార్యక్రమాలను రూపొందించాలి. వారి అభిప్రాయాలను కూడా పరిగణన లోకి తీసుకోవాలి. ఉత్తరాంధ్ర ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేయాలి. ప్రముఖులతో వివిధ అంశాల పై సదస్సులు నిర్వహించాలి. యూనివర్సిటీ వందేళ్ల విజన్ కు అవసరమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులతో పాటు ఏప్రిల్ 26 వ తేదీన శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను వీసీ వివరించారు. అనుబంధ కళాశాలలను ఉత్సవాల్లో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు పలు సూచనలు చేశారు. యూనివర్సిటీతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. విజిబిలిటీని క్రియేట్ చేయాలి. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ అద్భుత అవకాశం. సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో దొడ్డి



**మునగపాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 28**: మండలం లోని ఒంపోలు గ్రామంలో ఏమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు పాల్గొని పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరవాత చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. చంద్రబాబు అంటే సంక్షేమం, సంక్షేమం అంటే చంద్రబాబు అని పేద ప్రజలు కళ్ళల్లో ఆనందం చూడడం జరుగుతుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది అనడానికి నిదర్శనం, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ భవనాలు, సిసి రోడ్లు, సిసి డ్రైన్లు అనేక మైన సంక్షేమ కార్యక్రమాలు మొదలైనవి. గత ప్రభుత్వంలో గుంతల రోడ్లు వలన ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రజలకి తెలుసు అని, మన ప్రభుత్వ వచ్చాక రోడ్లన్నీ పూర్తి చేయడం ద్వారా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ప్రజలు, కార్మికులు, రైతులు ప్రభుత్వ పనితీరు పై చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అరాచకాల మధ్య రాష్ట్రం దివాలా అయ్యింది అన్న సంగతి ప్రతి గ్రామం లోని ప్రతి పౌరుడు కి తెలుసన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టు బడులు అధిక వస్తున్నాయి అనడానికి నిరుద్యోగ యువతకు ఉద్యోగులు రావడం, గ్రామాల్లో మౌలిక వసతులు పూర్తవడం. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి చెందుతుంది అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కృషి ఎంతగానో ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అవ్వని రోడ్, అచ్చుతాపురం టు అనకాపల్లి బైపాస్ వరకు రోడ్ శరవేగంగా పనులు జరుగుతున్నాయి అంటే ఏమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కృషి వల్లే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గన్ రెడ్డి సూరిబాబు, బద్ధపు ఈశ్వర రావు, పి నాగు, ప్రభుత్వ అధికారులు, పాల్గొన్నారు.

# బీసీల ద్రోహి జగన్ మోహన్ రెడ్డి మంత్రి సవిత





- ★ త్వరలో రూ.40 కోట్లతో పరిగిలో రోడ్ల అభివృద్ధి పనులు.
- ★ రూ.1.80 కోట్లతో బీసీ విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన.
- ★ అభివృద్ధి పై వైసిపి నాయకులు మంత్రి సవాల్.

**పరిగి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పి జగన్ మోహన్ రెడ్డి బీసీల ద్రోహిగా నిలిచారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి మంత్రి సవిత తీవ్రంగా విమర్శించారు. పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం లోని కోడిగినహళ్లి వద్ద రూ.1 కోటి 80 లక్షల నిధులతో నిర్మించనున్న బీసీ విద్యార్థుల వసతి గృహానికి ఆర్డీవో ఆనందరావు, జిల్లా బీసీ అధికారులతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమపాళ్లలో కొనసాగుతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాల పై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుందని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గించడం, పథకాలు నిలిపివేయడం వంటి చర్యల వల్ల బీసీ వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల సాధికారతకు కట్టుబడి ఉందని, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం కోసం పారదర్శక విధానాలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. బీసీ విద్యార్థుల కోసం త్వరలో మరో 10 గురుకులాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం. గత ఎన్నికల్లో పరిగి మండల ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని గుర్తుచేస్తూ, త్వరలోనే రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని మంత్రి తెలిపారు.
మధుగిరి నుంచి చెర్లోపల్లి వరకు రూ.82 లక్షలు,
మధుగిరి నుంచి మోదా పంచాయతీ వరకు రూ.56 లక్షలు,కేఏ రోడ్డు నుంచి కాలువపల్లి వరకు రూ.42 లక్షలు,పరిగి నుంచి హిందూపూర్ రోడ్ (వయా స్టేట్ బోర్డర్) వరకు రూ.4.11 కోట్లు, ఊటుకూరు నుండి ఫైడేటి (వయాఎర్రగుంట, తిరుమల దేవరపల్లి) రూ.2.10 కోట్లు,పరిగి నుంచి శిరేకొలం రోడ్ వరకు రూ.3 కోట్లు హిందూపురం రోడ్, ఊటుకూరు) వరకు రూ.3.84 కోట్లు, ఆనందపురం నుంచి సంగమేశ్వరం వరకు 3.2 కోట్లు,పరిగి నుంచి శ్రీరంగరాజు పల్లి 3.20 కోట్లు ఈ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు. అభివృద్ధి పై వైసీపీ నాయకులకు మంత్రి సవాల్. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లో జరిగిన అభివృద్ధిని, గత ఐదేళ్ల వైసీపీ పాలనతో పోల్చి రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు సిద్ధమని మంత్రి సవిత సవాల్ విసిరారు. దమ్ముంటే పెనుకొండలో అంబేద్కర్ సర్కిల్ వద్ద బహిరంగ చర్చకు



రావాలని వైసీపీ నాయకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి వలస పక్షుల్లా వచ్చి అధికారం దక్కిన తరువాత అభివృద్ధి చేయకుండా దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చింతమనేని ఆధ్వర్యంలో పింఛన్ పండుగ



దెందులూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 28: ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గ్రామ గ్రామాన పండగల సాగిన ఫించనుల పంపిణీ కార్యక్రమం. నియోజకవర్గ పరిధి లోని అనేక గ్రామాల్లో శనివారం తెల్లవారు ఝూము నుంచి సుడిగాలి పర్యటన చేపట్టి లబ్ధిదారులకు పింఛన్లు, పలువురు అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఆఫ్ చెక్కులను స్వయంగా పంపిణీ చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. పెదవేగి మండలం లోని మొండూరు, వేగివాడ, చక్రాయగూడం, దెందులూరు మండల పరిధి లోని సీతంపేట, ముప్పవరం, మేదినరావు పాలెం, రామారావు గూడెం సహా అనేక గ్రామాల్లో శనివారం ఉదయం మోటారు బైక్ పై సుడిగాలి పర్యటన చేపట్టి ఎన్టీఆర్ భరోసా, సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన చింతమనేని. పింఛన్ లబ్ధిదారులో వృద్ధులను, దివ్యాంగులను, అనారోగ్య బాధితులను ఆప్యాయంగా పలకరిస్తూ లబ్ధిదారుల చిరునవ్వుల సందడి మధ్య కొలాహలంగా సాగిన పంపిణీ కార్యక్రమం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ పేదవాడికి ప్రభుత్వం అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి, అన్న నందమూరి తారక రామారావు ఆనాడు రూ.30 రూపాయలతో చేపట్టిన సామాజిక పింఛన్లు పంపిణీ దినదినాభివృద్ధి చెంది ఈనాడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.4000/- రూపాయలుగా లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అయితే మధ్యలో ఒక ఐదు సంవత్సరాల పాటు ఒక్కసారి ఛాన్స్ అంటూ వచ్చిన వ్యక్తి మాటలు నమ్మి మోసపోయి ప్రజలు అవకాశం ఇస్తే, వాళ్ళ అవినీతి, అక్రమ, అరాచక పాలన వల్ల అమరావతి రాజధాని అపహాస్యం పాలైందని, ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సర్వనాశనం అయిందని, యువత ఉద్యోగాలు లేక, రాష్ట్రం అభివృద్ధి లేక అగమ్య గోచరంగా తిరోగమనము చెందిందని తెలిపారు. సామాజిక పింఛన్లను ఎన్నికల సమయంలో రూ.2,000 నుంచి 3,000 చేస్తానని చెప్పిన జగన్ ఆ వెయ్యి రూపాయలు పెంచుకుంటూ పోతా అంటూ చేయి ఎంతో బాగా సాగదీశారని, దీనివల్ల నమ్మి ఓట్లేసినందుకు ఎంతో మంది వృద్ధులు దివ్యాంగులు తీవ్ర మనోవేదనకు గురైయ్యారని అన్నారు. అయితే రూ.1,000 రూపాయలు ఫించను పెంచడానికి వైసిపి పాలనలో జగన్ కి ఐదు సంవత్సరాల కాలం పడితే రూ.3,000 రూపాయల ఫించను కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే చంద్రబాబు నాయుడు ఒక్క ధపాలుగా రూ.1,000 పెంచి రూ.4,000 ఇవ్వడమే కాకుండా ఎన్నికల హామీలో ఇచ్చిన గత మూడు నెలల కాలం పెంచిన పింఛన్లు కూడా అమలు చేస్తూ అధికారం లోకి వచ్చిన మొదటి నెలలోనే పాత బకాయిలతో సహా లబ్ధిదారులు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను అందించి ఫించన్ పండగ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. మార్చి 1 వ తేదీ ఆదివారం రావడంతో, అధికారులకు సిబ్బందికి సెలవు రోజు కావడంతో ప్రతి నెల వచ్చే సామాజిక పింఛన్ల కోసం ఎదురు చూసే లబ్ధిదారుల అభిప్రాయాలను కూటమి ప్రభుత్వం పరిగణ లోకి తీసుకుని ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రం లోని బిజెపి సహకారంతో దేశ చరిత్ర లోనే రూ.37 వేల కోట్ల రూపాయలను పింఛన్ల రూపంలో అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలుస్తుందని ప్రతి పేదవాడికి మెరుగైన విద్య వైద్య అభివృద్ధి సంక్షేమాలను అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ మంత్రి లోకేష్ ఎంతగానో కృషి చేస్తున్నారని, ప్రతినెల అందించే సామాజిక పింఛన్ల డబ్బు కోసం పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిన్న కొడుకులా పవన్ కళ్యాణ్ లబ్ధిదారులకు ఎంతో అండగా నిలుస్తున్నారు అన్నారు. ఈ సందర్భంగా వారిని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించేలా ప్రజలు దీవించాలని చింతమనేని ప్రభాకర్ కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలు పింఛన్ లబ్ధిదారులు చేసినటువంటి వారి త్యాగాలకు ప్రతీకగా ప్రతి నెల సామాజిక ఫించనులను సమర్థవంతంగా అమలు చేస్తూ తమ బాధ్యతలు నిర్వహిస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్ కు మంత్రి లోకేష్ శంకుస్థాపన.





**రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాలు కల్పించనున్న బ్లూ జెట్.**

**అనకాపల్లి,పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఉత్తరాంధ్రలో మరో భారీ ఔషధ తయారీ పరిశ్రమకు అంకురార్పణ జరిగింది. అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధి లోని సీతపాలెం వద్ద ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) లో ప్రముఖ ఫార్మా కంపెనీ బ్లూ జెట్ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా రాంబిల్లి మండలం లోని సీతపాలెం ఇండస్ట్రియల్ పార్క్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు కంపెనీ ప్రతినిధులు, కూటమి నేతలు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమకు మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. రాంబిల్లి మండలం ఇండస్ట్రియల్ పార్క్ లో బ్లూ జెట్ పరిశ్రమ ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియట్లు, కాంట్రాక్ట్ డెవలప్ మెంట్ తయారీ యూనిట్ ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ. 2,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,750 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన బ్లూజెట్ పరిశ్రమకు కూటమి ప్రభుత్వం 102.48 ఎకరాలను కేటాయించింది. మూడు దశల్లో ఫార్మా కంపెనీని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్, యలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీఆర్డీసీ ఛైర్మన్ పి.నాగేశ్వర రావు, బ్లూ జెట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ అక్షయ్ బన్సారీలాల్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా, కలెక్టర్ విజయ కృష్ణన్, బ్లూ జెట్ హెల్త్‌కేర్ బృంద సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఏపీఐఐసీ, వివిధ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.













# రాష్ట్రంలో ఒక రోజు ముందే పెన్షన్ల పండుగ.





**పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి సవిత.**

**పరిగి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** రాష్ట్రంలో ఒక రోజు ముందుగానే పెన్షన్ల పండుగ వాతావరణం నెలకొన్నట్లు మంత్రి సవిత తెలిపారు. పరిగి మండలం కొడిగేనహళ్లి గ్రామంలో ఆర్డీఓ ఆనందరావు, ఇతర అధికారులతో కలిసి మంత్రి సవిత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తూ, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల మందికి రూ. 2,717 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 63 వేల మందికి రూ. 115 కోట్లు, పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా 40 వేల మందికి సుమారు రూ. 18 కోట్లు, పరిగి మండలంలో 8,500 మందికి రూ. 3.60 కోట్లు, కొడిగేనహళ్లి గ్రామంలో సుమారు 1,450 మందికి రూ. 46 లక్షలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి, విడతల వారీగా కాకుండా ఒకేసారి పెన్షన్లను పెంచినట్లు పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 చొప్పున పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. 2019 లో అధికారం లోకి వచ్చిన జగన్ రూ. 3,000 కు పెంచుతానని హామీ ఇచ్చి, అయిదేళ్లలో విడతలవారీగా రూ. 250 చొప్పున పెంచుతూ వచ్చారని విమర్శించారు. సామాజిక పెన్షన్లను ప్రవేశపెట్టిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు నేడు నెలకు రూ. 4,000 చొప్పున పెన్షన్లు చెల్లిస్తున్నారని అన్నారు.అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చుతున్నామని, అక్కాచెల్లెమ్మలకు మేలు కలిగేలా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమైందని విమర్శించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమాంతరంగా అమలు చేస్తున్నామని మంత్రి సవితమ్మ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి.

- మన చుట్టూ ఉన్న పరిసరాల శుభ్రత మన బాధ్యత.
- కలెక్టర్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం.
- జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్.





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారానే చెత్త లేని వాతావరణాన్ని సాధ్యం చేయగలమని జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ అన్నారు. శనివారం ఉదయం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, పరిసరాలు పరిశుభ్రం చేసే కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తుందని, ప్రజల సహకారంతో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేపట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇళ్ల చుట్టూ చెత్త పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధులు నివారించవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడి సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని, అలా చేయడం వలన మన కుటుంబం, మన జిల్లా, మన దేశ ప్రజల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. వ్యర్థాలను తగ్గించడం మరియు చెత్తా చెదారం లేని పరిసరాలను ఏర్పాటు చేసుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్ రహిత పద్ధతులు, ఘన వ్యర్థాల నిర్వహణ, మరియు ప్రజల భాగస్వామ్యంతో పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, అనకాపల్లి ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, డిఎల్పిఓ మూర్తి, అనకాపల్లి డిప్యూటీ ఎంపీడీఓ రాము, పంచాయతీ అభివృద్ధి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో 40 జాతీయ సైన్స్ దినోత్సవం.




**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్థానిక ఏ.ఎం.ఏ.ఎల్. కళాశాలలో శనివారం 40 వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి కళాశాల గవర్నింగ్ బాడీ కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సర్ సి.వి. రామన్ జీవిత విశేషాలను తెలియజేసి, వారు కనుగొన్న రామన్ ఎఫెక్ట్ గురించి వివరించి, ప్రతి విద్యార్థి కూడా ఒక సి.వి. రామన్ స్థాయికి ఎదగాలని, ఆ విధమైన ఆచరణ చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రీసర్చ్ జరగాలని, ఆ దిశగా విద్యార్థులు ఆలోచన చేయాలని కోరారు. కెమిస్ట్రీ ఫ్యాకల్టీ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లోను కృషి, పట్టుదల ఉన్నట్లయితే ఒక ఋషిగా ఎదగవచ్చు అని సూచన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీ కార్యక్రమాలను నిర్వహించి వాటిలో మొదటి మూడు స్థానాలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు, కళాశాల సూపర్ఇంటెండెంట్ పి. అనురాధ, టీచింగ్, నాన్ టీచింగ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతి నికేతన్ లో సైన్స్ దినోత్సవం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** స్థానిక ప్రశాంతి నికేతన్ ఎం.వీ.వి ఎస్ మూర్తి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరెస్పాండంట్ దొడ్డి వరాహ శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్ సి.వీ. రామన్ నోబెల్ పురస్కారాన్ని పొందిన సందర్భం గా ప్రతి ఏడాది ఈ రోజు సైన్స్ దినోత్సవాన్ని మనం నిర్వహించాకుంటున్నామని, విద్యార్థులు అందరు శాస్త్రీయ దృక్ఫదాని అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు ఉత్సహం గా పాల్గొని తమ తమ సైన్స్ ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు డి. శ్రీనివాస్ రావు, ఎం. బాలాకుమారి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గున్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అన్న ప్రసాద కార్యక్రమం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 28:** పట్టణం లోని దేముని గుమ్మం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి. వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. స్వామివారి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. శనివారం దేవాలయ వద్ద స్వామివారి అన్న ప్రసాదాన్ని ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని పెద్దలు చెబుతుంటారు, సాక్షాత్తు కలియుగ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అనంతరం అన్నదానం చేయడం దేవాలయానికే కాక ఈ ప్రాంత ప్రజలు భక్తులు సుఖ సంతోషాలతో ఉంటారని, అన్నదానం అనేది ఎంతో మహత్యం కలిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాదికార కె చంద్ర తేజ, దేవాలయం ప్రధాన అర్చకులు పులకడం గిరిబాబు, ధర్మకర్తలు గోలి మురళి, సిహెచ్ నూకరాజు, కొణతాల అరుణ, నిమ్మకాయల తులసి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తమ్మయ్యపేటలో ఎటువంటి నీటి కొరతా లేదు చిన్నారావు







**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 28**:తమ్మయ్యపేటలో కొంతమంది నీటి సమస్య ఉందని, త్రాగునీరు అందటం లేదనీ ఖాళీ బిందెలు పట్టుకుని ఫోటోలు పెట్టడం జరిగింది. వాస్తవానికి తమ్మయ్య పేటలో ఎటువంటి మంచినీటి కొరత లేదని, తమ్మయ్యపేటలో 3 చేతి బోర్లు అందుబాటులో ఉన్నాయని, సోలార్ ద్వారా మంచి నీటి ట్యాంక్ కు నీరు వెళ్తుందని అన్నారు. ఇన్ని రకాలుగా మంచి నీరు అందుబాటులో ఉన్న కావాలనే కొంత మంది చెప్పుడు మాటలు విని వాళ్ళు ఆ రకంగా ప్రవర్తించారని గ్రామ సర్పంచ్ దొప్పెర్ల చిన్నారావు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న వాస్తవాలు వాళ్లకు తెలియడం లేదని అన్నారు. తమ్మయ్యపేటలో గత 40 సంవత్సరాల క్రితం 209/2/32 సర్వే నంబర్లు కొంతమంది ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని, ఆ 20 ఇల్లులకు పంచాయతీ పను వేస్తున్నామని, రోడ్లు నిర్మించామని తెలిపారు. ఆ ఎకరంలో ఇద్దరు పేర్ల మీద ఆన్లైన్ చేయించుకుని భూ యజమానులు ఆ భూమి పై రుణం తీసుకున్నారని బ్యాంక్ అధికారులు విచారణకు రావడంతో విషయం వెలుగు లోకి వచ్చిందని తెలిపారు. ముచ్చు గంగరాజు పేరు పై ఏ విధంగా ఆన్లైన్ అయిందని వారి పేరుతో భూమిలో ఉన్న బోరు కి గ్రామ పంచాయతీ ఏ విధంగా విద్యుత్ లైన్ ఇవ్వగలమని అన్నారు. రెవెన్యూ వారు ఆన్లైన్లో వారి పేర్లు తొలగిస్తే గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం ఇచ్చి విద్యుత్ లైన్ ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. కావాలనే దోపెర్ల పంచాయితీ శివారు తమ్మయ్య రాజకీయ కుట్రలు పనుతున్నారని గ్రామంలో ఏ రకమైన రాజకీయాలు లేవని తమ్మయ్య పేట గ్రామస్తులకు మంచినీరు అందుతుందని తెలిపారు. దయచేసి రెవెన్యూ అధికారులు గానీ, మండల అభివృద్ధి అధికారులు గాని ఆ భూమినీ కబ్జా చేసిన వాళ్ల నుంచి విడిపించి వాళ్లకు న్యాయం చేయాలని కోరారు. దీనికి సంబంధించి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మరియు ఎంపి సీఎం రమేష్ కు వినతిపత్రం అందజేయడం జరిగిందని దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు తెలిపారు.

# భద్రాద్రి అభివృద్ధిలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సేవలు అభినందనీయం.

## సమగ్ర దృష్టితో ముందుకు నడిపిన దృఢ నాయకత్వం ప్రజామమేక పరిపాలనకు కొత్త నిర్వచనం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 28:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి గాథలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిన పరిపాలన అంటే జితేష్ వి. పాటిల్ నాయకత్వమే అని చెప్పాలి. 2024 జూలై 16న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన రాముని దర్శనానికి వెళ్తున్న సమయంలో బూర్గంపాడు సమీపంలో ప్రమాదం జరిగి గాయపడిన క్షతగాత్రులను ఆయన స్వయంగా తన వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. 26 ఫిబ్రవరి 2026 వరకు తన పదవీకాలంలో జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా స్పష్టమైన విజన్‌తో ముందుకు నడిపించారు. వ్యవసాయం, గిరిజన సంక్షేమం, యువత సాధికారత, విద్యా ఆరోగ్య రంగాలు, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకం, రహదారి మౌలిక వసతులు వంటి ప్రతి విభాగంలో సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి అభివృద్ధిని ప్రజల దైనందిన జీవితాలకు చేరువ చేశారు.

తన పరిపాలనలో పారదర్శకత, ఫలితాల ఆధారిత అమలు, ప్రజలతో మమేకం, శాఖల సమన్వయం, 24 గంటల అందుబాటు, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ వంటి అంశాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. యాస్పిరేషన్ జిల్లా పురోగతిలో మూడు జాతీయ అవార్డులు గవర్నర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి సంపూర్ణ అభి యాన్ అవార్డు, నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీ షనర్ అవార్డు, జల సంచయ్ జల్ భాగీదారీ అవార్డులు సాధించడం ఆయన సమర్థ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచింది.

### వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు

రైతు కుటుంబంలో జన్మించిన పరిపాలకుడిగా రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మునగ సాగు, అంతర పంటలు, పెరటి కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు వంటి అనుబంధ వ్యవసాయ విధానాలను విస్తృతంగా ప్రోత్సహించి రైతుల ఆదాయ వనరులను విస్తరించారు. ఫామ్ పౌండ్లలో చేపల పెంపకాన్ని ప్రవేశపెట్టి సమీకృత వ్యవసాయ విధానాన్ని అమలు చేశారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ బయోచార్ తయారీని స్వయంగా ప్రదర్శించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యమని రైతుల్లో అవగాహన కల్పించారు. వ్యవసాయాన్ని నష్టరహిత రంగంగా కాకుండా లాభదాయక రంగంగా మలచాలనే దృఢ సంకల్పంతో రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

### యువత, మహిళల సాధికారత

నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా శిక్షణలు, ఫర్నిచర్ తయారీ యూనిట్లు, "గురుశిష్య హస్తశిల్పి" కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించారు. పలు ప్రైవేట్ మరియు కార్పొరేట్ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళా సంఘాలకు సమీకృత వ్యవసాయం, కౌజు పిట్టల పెంపకం, కూరగాయల సాగు, మేకల పెంపకం వంటి రంగాల్లో శిక్షణలు అందించి ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఎగ్జిబిషన్లు, మేళాలు నిర్వహించారు. మహిళా సాధికారతను కుటుంబ స్థాయి నుంచి గ్రామ స్థాయికి విస్తరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేశారు.

### సమీకృత వ్యవసాయ ఫార్మ్ హౌస్‌లు రైతు కుటుంబానికి స్థిరమైన ఆర్థిక భరోసా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతు ఆదాయం పెంపు దిశగా సమీకృత వ్యవసాయ ఫార్మ్ హౌస్‌లను ఆదర్శ నమూనాగా అభివృద్ధి చేశారు. ఒకే ప్రాంగణంలో పంటలు, పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి విభిన్న కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహించే విధానాన్ని ప్రోత్సహించి "ఒకే భూమి అనేక ఆదాయ వనరులు" అనే భావనను ప్రజల్లో నాటారు. ఫామ్ పౌండ్లు, సేంద్రియ ఎరువుల తయారీ, కూరగాయలు వంటి సమీకరణతో ఖర్చులు తగ్గించి, సంవత్సరం పొడవునా ఆదాయం వచ్చేలా చక్రాకార వ్యవస్థను అమలు చేశారు. చిన్న, సన్నకారు రైతులకూ లాభదాయకమైన, పర్యావరణహితమైన వ్యవసాయ నమూనాగా ఈ ఫార్మ్ హౌస్‌లు జిల్లాలో స్ఫూర్తిదాయక మార్గదర్శకంగా నిలిచాయి.

### విద్యాఆరోగ్య రంగాల్లో సంస్కరణలు

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో రాత్రి బస చేసి విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు చేపట్టారు. పాఠశాలల్లో కిచెన్ షెడ్, విద్యార్థుల్లో క్రీడా ప్రోత్సాహం అందించేదా అవసరమైన క్రీడా సామాగ్రి అందించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులను పూర్తి చేయించారు.

మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక పరికరాల సమకూర్పు, అత్యవసర వాహనాల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకం వంటి చర్యలతో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేశారు. ఆరోగ్య రంగంపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదర్శప్రాయ నిర్ణయం తీసుకొని ఆయన సతీమణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రజలకు సమయానుకూల వైద్య సేవలు అందేలా సమగ్ర పర్యవేక్షణ చేపట్టారు.

### గిరిజనాభివృద్ధి సివిఎస్ఆర్ సమ్మిట్

గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సీ ఎస్ ఆర్) నిధులను సమర్థంగా వినియోగిస్తూ జిల్లా స్థాయిలో భారీ సివిఎస్ఆర్ సమ్మిట్ నిర్వహించారు. పలు సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి విద్య, ఆరోగ్యం, తాగునీరు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో దీర్ఘకాల ప్రణాళికలు రూపొందించారు. ఇది గిరిజనాభివృద్ధికి కొత్త దిశానిర్దేశంగా నిలిచింది. గిరిజన ఉత్పత్తులు నాయక పోడు మాస్క్ దేశవ్యాప్త గుర్తింపు ప్రత్యేక కృషి చేశారు.

### ఖనిజ సంపదకు శాస్త్రీయ దిశ భూవిజ్ఞాన కేంద్రంగా భద్రాద్రి

జిల్లాలో సమృద్ధిగా ఉన్న ఖనిజ సంపద, భౌగోళిక వైవిధ్యంపై సమగ్ర అధ్యయనం జరిపించి, భూవిజ్ఞాన పరిశోధనలకు భద్రాద్రి అనుకూల కేంద్రంగా అభివృద్ధి చెందగలదని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. భూగర్భ వనరులు, ఖనిజ నిల్వలు, జలవనరులు, వాతావరణ మార్పులపై లోతైన పరిశోధనలకు అవసరమైన సహజ వాతావరణం జిల్లాలో ఉన్నదని స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించారు. ఈ దూరదృష్టి ఫలితంగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సస్ యూనివర్సిటీ స్థాపనకు మార్గం సుగమమై, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను భూ విజ్ఞాన విద్యాపరిశోధనల జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు పడింది. ఇది జిల్లా అభివృద్ధికి దీర్ఘకాల శాస్త్రీయ పునాది ఏర్పరిచిన మైలురాయిగా నిలిచింది.

### పర్యావరణ పరిరక్షణలో "భద్రాద్రి మోడల్"

ఇంకుడు గుంతల ఉద్యమం, ఔషధ మొక్కల నాటకం, సీడ్ బ్యాంకుల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో "భద్రాద్రి మోడల్"ను రూపుదిద్దించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

### పర్యాటకాభివృద్ధి భద్రాద్రి ఖ్యాతి.

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో ప్రతి ఆదివారం నదీహారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు . శ్రీరామనవమి ముక్కోటి మహోత్సవాల సందర్భంగా పటిష్ట ప్రణాళికలు అమలు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఏరు ది రివర్ ఫెస్టివల్, కిన్నెరసాని రివర్ వాక్ , శ్రీనివాస గుట్ట ట్రెక్కింగ్, బెండలపాడు ఫారెస్ట్ వాక్ వంటి పర్యాటక ప్రదేశాలను మీడియా ద్వారా బాహ్య ప్రపంచానికి తెలియజేసి జిల్లాను పర్యాటకపరంగా ముందుకు నడిపించారు.

### క్రీడా ప్రోత్సాహంతో యువతలో స్ఫూర్తి

జిల్లాలోని క్రీడాకారుల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిస్తూ ఆధునిక క్రీడా సౌకర్యాల ఏర్పాటు, మైదానాల అభివృద్ధి, అవసరమైన క్రీడా సామాగ్రి సమకూర్పులో ప్రత్యేక కృషి చేశారు. గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులకు వేదిక కల్పించారు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో క్రీడా ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టి యువతలో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, పోటీ భావనలను పెంపొందించే దిశగా సమగ్ర చర్యలు అమలు చేశారు.

### రహదారి మౌలిక వసతుల బలోపేతం

రహదారులపై గుంతల సమస్యను శాశ్వత పరిష్కార దిశగా తీసుకెళ్లేందుకు కోల్డ్ మిక్స్ సాంకేతికతను ప్రవేశపెట్టారు. వర్షాకాలంలో కూడా తక్షణ మరమ్మతులు చేపట్టే విధంగా దశలవారీ ప్రణాళిక అమలు చేసి ప్రధాన, గ్రామీణ రహదారులను వేగంగా పునరుద్ధరించారు.

### బ్రిక్స్ ఛాలెంజ్" తక్కువ ఖర్చుతో నిర్మాణ విప్లవం

తక్కువ ఖర్చుతో ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ "బ్రిక్స్ ఛాలెంజ్" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. స్థానిక మట్టితో ఇటుకల తయారీని స్వయంగా ప్రదర్శించి యువతను భాగస్వాములుగా మార్చారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జైశ్రీరామ్ నామంతో ఇటుకల తయారీకి శ్రీకారం చుట్టారు. పర్యావరణ హిత పద్ధతిలో మట్టి ఇటుకలతో నిర్మాణం సాధ్యమని నిరూపించి ఖర్చు తగ్గింపుతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించారు.

### ప్రతిష్టాత్మక కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభోత్సవం, సీతారామ బహుళార్థక ప్రాజెక్ట్ జాతికి అంకితం, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించారు. అలాగే శ్రీరామనవమి, ముక్కోటి మహోత్సవాలు, మున్సిపల్, పంచాయితీ ఎన్నికలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించి జిల్లా పరిపాలన సామర్థ్యాన్ని చాటిచెప్పారు.

### డ్రోన్ సాంకేతికతతో వేగవంతమైన వరద సహాయం

వర్షాకాలంలో గోదావరి రివర్ ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురైన సందర్భాల్లో డ్రోన్ సాంకేతికతను వినియోగించి చిక్కుకుపోయిన బాధితులకు ఆహార పొట్లాలు, తాగునీటి సాచెట్లు మరియు అత్యవసర సరఫరాలను నేరుగా గాల్లో నుంచి దించి అందించి,వరదల సమయంలో సమయానుకూల సహాయక చర్యలు చేపట్టడం విశేషంగా నిలిచింది. ఉపాధి హామీ పథకం పనులు ల్లో పాల్గొని తాను కూడా కూలీగా పనులు చేసి ఆదర్శంగా నిలిచారు.

జిల్లా అభివృద్ధికి అంకితభావంతో సేవలందించిన జితేష్ వి . పాటిల్ ప్రస్తుతం తెలంగాణ సౌతేర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## అమెరికాను మించి ఇజ్రాయెల్...

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్‌ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బందాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, ఐఐ రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ఇజ్రాయెల్ మధ్య సంత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉనానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్‌ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు.రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

# నిద్రలేమికి ఈ తప్పులే కారణం!



ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడి సంపాదించేది తినడానికే.. తిన్నది డైజెస్ట్ కావాలన్నా.. ఆరోగ్యంగా ఉండాలన్నా శరీరానికి తగినంత విశ్రాంతి అవసరం. ఉరుకుల పరుగుల జీవితంలో పడుకోవడానికి సమయం కేటాయించడం కూడా చాలా మందికి కష్టమైపోతోంది. నిద్ర కరువైతే అనారోగ్య సమస్యలు ఒకదాని వెంట ఒకటి శరీరంపై దాడి చేస్తాయి. రోజంతా కష్టపడి పని చేసి రాత్రి ఇంటికి రాగానే హాయిగా నిద్రపోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ చాలామందికి బెడ్ మీద పడుకోగానే నిద్ర రాదు. స్మార్ట్‌ఫోన్ తీసి రీల్స్ చూడటం లేదా పాత విషయాలను తలుచుకుంటూ గంటల కొద్దీ మేల్కొనే ఉంటారు. దీనివల్ల మరుసటి రోజు పనిలో ఏకాగ్రత దెబ్బతినడమే కాకుండా, చిరాకు, నీరసం ఆవహిస్తాయి. నిద్ర అనేది మన శరీరానికి ఒక రీఛార్జ్ లాంటిది. అది సరిగ్గా లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది. అయితే మీ లైఫ్ స్టైల్ లో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో ఒక అంతర్గత గడియారం ఉంటుంది, దానినే 'సిర్కాడియన్ రిథమ్' అంటారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఉదయాన్నే ఒకే టైమ్‌కి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మీ శరీరానికి ఎప్పుడు నిద్రపోవాలో ఒక పద్ధతి అలవాటు అవుతుంది. సెలవు రోజుల్లో కూడా ఈ సమయాన్ని మార్చకుండా ఉండటం వల్ల గాఢ నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. చాలామంది రాత్రి పూట కూడా కాఫీ లేదా టీ తాగుతుంటారు. వీటిలో ఉండే కెఫిన్ మన మెదడును అలెర్ట్ గా ఉంచుతుంది, దీంతో నిద్ర రాదు. నిద్రపోయే ఆరు గంటల ముందే కెఫిన్ ఉన్న పానీయాలను ఆపేయాలి. అలాగే ఆల్కహాల్ తాగితే నిద్ర వస్తుందని కొందరు భావిస్తారు కానీ, అది నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుంది. గాఢ నిద్రకు ఆటంకం కలిగించి అర్ధరాత్రి మెలకువ వచ్చేలా చేస్తుంది. మనం నిద్రపోయే గది ఎలా ఉందనేది మన నిద్రను ప్రభావితం చేస్తుంది. బెడ్ రూమ్ ఎప్పుడూ శుభ్రంగా, ప్రశాంతంగా ఉండాలి. గది ఉష్ణోగ్రత మీకు అనుకూలంగా ఉండేలా చూసుకోండి. లైట్లు డిమ్ గా ఉంటే శరీరంలో నిద్రను ప్రేరేపించే హార్మోన్లు విడుదలవుతాయి. ముఖ్యంగా పడక గదిని కేవలం నిద్రకు, విశ్రాంతికి మాత్రమే పరిమితం చేయాలి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీనివల్ల మన మెదడు అది పగలు అని పొరబడి నిద్రను దూరం చేస్తుంది. నిద్రపోయే ఒక గంట ముందు నుంచే గాడ్జెట్లను దూరంగా పెట్టడం అలవాటు చేసుకోండి. రీల్స్ చూడటం ఒక వ్యసనంలా మారి మీ విలువైన నిద్ర సమయాన్ని హరించేస్తుందని గుర్తించాలి. పడుకునే ముందు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. ఒక మంచి పుస్తకం చదవడం, మెలోడీ సంగీతం వినడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. అలాగే డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) లేదా ధ్యానం చేయడం వల్ల మనస్సులోని ఆందోళనలు తొలగిపోయి శరీరం నిద్రకు సిద్ధమవుతుంది.

# ఇప్పపువ్వుతో ఆ జబ్బులన్నీ మాయం!

ఇప్ప పువ్వు కేవలం సారా కోసమే అనే అపోహను వీడి.. దాని అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయుర్వేదంలో విరివిగా ఉపయోగించే ఇప్ప పువ్వు, కడుపు సమస్యలు, గుండె జబ్బులు, నోటిపూత, కీళ్ల నొప్పులు, చర్మ సమస్యలు వంటి అనేక సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇప్ప పువ్వులో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. అందుకే.. విప్ప పువ్వును తీసుకోవాలని సూచిస్తుంటారు ఆయుర్వేద నిపుణులు.. ఇది పోషకాలు, ఔషధ గుణాలతో నిండిన ఒక అద్భుతమైన అటవీ ఉత్పన్నం.. అందుకే.. దీనిని ఆదివాసీలు బలంగా ఉండటానికి అసలు సీక్రెట్ ఇదేనని పేర్కొంటారు. ఇప్ప పూలలో విటమిన్ బి, సి, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఈ పువ్వుల సారం రక్తాన్ని శుద్ధి చేస్తుంది.. ఇంకా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వాస్తవానికి.. ఇప్ప పువ్వు అంటే చాలా మందికి కేవలం సారా తయారీకి మాత్రమే ఉపయోగిస్తారనే భ్రమ ఉంటుంది. అయితే, ఇప్ప పువ్వులో దాగి ఉన్న అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి తెలియదు. ఆయుర్వేదంలో ఔషధాల తయారీకి ఇప్ప పువ్వును విరివిగా వాడుతారు. దీనిని నేరుగా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇప్ప పువ్వు కడుపు సంబంధిత సమస్యలకు చక్కటి పరిష్కారం చూపుతుంది. అల్సర్, కడుపు ఉబ్బరం వంటి వాటికి ఇప్ప పువ్వు రసం తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. అంతేకాకుండా



జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే ఓలిక్ యాసిడ్ గుండె జబ్బులను నివారించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటితో పుక్కిలించడం వల్ల నోటిపూత, నోటి మంట, పంటి నొప్పి వంటి ఇబ్బందులు తగ్గుతాయి. పాలల్లో ఇప్ప పువ్వు కలుపుకొని తాగడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇప్పపువ్వు తీసుకుంటే తక్షణ శక్తి లభిస్తుంది. ఇంకా బలహీనత తగ్గి.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఇప్ప పువ్వుతో తయారు చేసిన తైలం కీళ్ల నొప్పులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. చర్మంపై వచ్చే దద్దుర్లు, దురదను తగ్గించడంలో ఇప్ప పువ్వు రసం ప్రభావవంతంగా ఉంటుంది. నరాల బలహీనతతో బాధపడేవారు పాలలో ఇప్ప పువ్వును కలుపుకొని తాగితే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడవచ్చు.

# మానసిక ఒత్తిడితో మలబద్ధకం సమస్య వస్తుందా?

నేటి కాలంలో తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని మీకు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడితో చిత్తవుతున్నారు. ఇది తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని మీకు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. నరాలు, హార్మోన్లు, పేగు మైక్రోబయోటా ఈ సంబంధాన్ని నిర్వహిస్తాయి. ఈ గట్-బ్రెయిన్ యాక్సిస్ వ్యవస్థ కారణంగా ఒత్తిడి జీర్ణవ్యవస్థను ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది మలబద్ధకం, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. ఐఓఅ హాస్పిటల్‌లోని మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ శెట్టి దీని గురించి మరింత సమాచారాన్ని అందించారు. ఒత్తిడి సమయంలో నాడీ వ్యవస్థ అధిక చురుకుదనం వల్ల ప్రేగు కదలికలు మందగిస్తుంది. దీని వల్ల మలబద్ధకం వస్తుంది. దీనితో పాటు ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, పేగు పారగమ్యత పెరగడం, గట్ మైక్రోబయోటాలో మార్పులు సంభవిస్తాయి. ఇవన్నీ మలబద్ధకానికి దోహదం చేస్తాయి.



ఒత్తిడి సమయంలో తినే విధానాలు కూడా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎక్కువ స్వీట్లు తినడం, ఎక్కువ కెఫిన్ తీసుకోవడం, ఎక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తినకపోవడం ఇవన్నీ జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక విష చక్రం మాదిరి పని చేస్తుంది. ఇక్కడ ఒత్తిడి మలబద్ధకానికి కారణమవుతుంది. మలబద్ధకం ఒత్తిడిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం చాలా ముఖ్యం. ఇది మానసిక, శరీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినాలి. మొలకలు తినదం, తగినంత నీళ్లు తాగడం చేయాలి. రోజువారీ వ్యాయామం, తగినంత శారీరక శ్రమ అవసరం. మలవిసర్జన సంకేతాలను విస్మరించవద్దు. శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి ఇది అవసరమని గుర్తుంచుకోండి. మలబద్ధకం సమస్య సాధారణ పద్ధతుల ద్వారా పరిష్కరించబడకపోతే, సమస్య చాలా కాలం పాటు కొనసాగితే బరువు తగ్గడం, హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గితే, మలంలో రక్తం కనిపిస్తే, కుటుంబంలో ఎవరికైనా పెద్దప్రేగు క్యాన్సర్ చరిత్ర ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు.

# వెస్టిండీస్‌తో భారత్ కీలక పోరు నేడు

**అభిమానుల చూపంతా అటువైపే. టీమ్ఇండియాకు ఇక చావో రేవో! ఈ టీ20 ప్రపంచకప్‌లోనే తనకు అత్యంత కీలకమైన పోరుకు డిఫెండింగ్ ఛాంపియన్ సిద్ధమైంది. క్వార్టర్‌ఫైనల్ లాంటి సూపర్ 8 మ్యాచ్‌లో నేడు వెస్టిండీస్‌ను ఢీకొంటుంది. గెలిస్తే సెమీఫైనల్‌కు లేదంటే టోర్నీ నుంచి బయటికి. గత మ్యాచ్‌తో బ్యాటుతో ఫామ్‌ను అందుకున్న భారత జట్టుకు బౌలింగ్ మాత్రం ఇంకా సమస్యగానే ఉంది. భారత్‌లాగే కరీబియన్ జట్టులోనూ భారీ హిట్టర్లకు కొదవలేదు. ఈ నేపథ్యంలో బంతితో పుంజుకోవడం ఆతిథ్య జట్టుకు చాలా ముఖ్యం.**



రసవత్తర సమరానికి వేళైంది. టీ20 ప్రపంచకప్ గ్రూప్-1 సూపర్ 8 మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆదివారం వెస్టిండీస్‌ను ఢీకొట్టనుంది. దక్షిణాఫ్రికా చేతిలో విండీస్ ఓడిపోవడం, జింబాబ్వేపై భారత్ ఘనవిజయంతో ఈ పోరు క్వార్టర్‌ఫైనల్‌గా మారిపోయింది. ఈ టోర్నీలో రెండు జట్లు కూడా ఒక్క ఓటమే చవిచూశాయి. రెండు జట్ల బ్యాటింగూ బలంగా ఉంది. సిక్సర్ల హోరు ఖాయం. దీంతో పోరు చాలా ఆసక్తి కలిగిస్తోంది. ఈ మ్యాచ్‌లో విజేత మార్చి 5న ముంబయిలో జరిగే సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఢీకొంటుంది.

బంతితో పుంజుకోవాలి టోర్నీ ఆరంభం నుంచి బ్యాటింగ్‌లో ఏదో తడబాటు. భారత్ గ్రూపు దశలో అగ్రస్థానంలో నిలిచినా.. బ్యాటుతో ఆ జట్టులో సాధికారత లోపించింది. సూపర్ 8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోవడం పెద్ద షాక్. కానీ జింబాబ్వేతో పోరుతో టీమ్ఇండియా బ్యాటింగ్ మళ్లీ గాడినపడింది. టాప్-6 సమష్టిగా రాణించారు. బరిలోకి దిగిన ప్రతి బ్యాటరూ బ్యాట్ ఝుళిపించడంతో బ్యాటింగ్‌పై ఆందోళనకు తెరపడ్డట్లయింది. 24 పరుగులే చేసినా, ఓపెనర్‌గా సంజు శాంసన్ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. అభిషేక్ శర్మ కూడా చక్కని అర్ధశతకంతో ఫామ్‌ను అందుకున్నాడు. తిలక్ వర్మ, హార్దిక్, సూర్యకుమార్‌ల దూకుడైన ఇన్నింగ్స్‌లు జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఇషాన్ కూడా లయలోనే ఉన్నాడు. బ్యాటర్లు మరోసారి గర్జించడానికి సిద్ధమవుతున్నారు. కానీ బౌలింగే ఆందోళన కలిగిస్తోంది. అది పూర్తిగా గాడినపడలేదు. గత మ్యాచ్‌లో జింబాబ్వేపై సూపర్‌గా బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్ మూడు వికెట్లు పడగొట్టాడు. బుమ్రా, హార్దిక్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అయితే బుమ్రా పొదుపుగానే బౌలింగ్ చేస్తున్నా.. మరిన్ని వికెట్లు పడగొట్టాలని జట్టు కోరుకుంటోంది. భారత్‌కు అసలు చిక్కంతా స్పిన్‌తోనే. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి పేలవ ఫామ్ జట్టుకు ప్రతికూలంగా మారింది. ఈ మిస్టరీ స్పిన్నర్ మ్యాజిక్ ఎటు పోయిందో తెలియదు. ఇప్పటివరకు అతడి ప్రదర్శన పేలవం. దక్షిణాఫ్రికాపై 4 ఓవర్లలో 47 పరుగులిచ్చాడు. జింబాబ్వేపైనా ప్రభావం చూపలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతడు పుంజుకోవడం జట్టుకు ఎంతో అవసరం. గత మ్యాచ్‌లో అక్షర్ పటేల్ కూడా 35 పరుగులిచ్చాడు. మరోవైపు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ దూబెపై ఏమాత్రం ఆధారపడలేని పరిస్థితి. జింబాబ్వేపై అతడు రెండు ఓవర్లలోనే 46 పరుగులు సమర్పించుకున్నాడు. తన మీడియం పేస్‌తో అతడు విండీస్ బ్యాటర్లను కట్టడి చేయగలడా అన్నది అనుమానమే. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు.

**ఈడెన్‌లో మనమే..**

1983 నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో ఏ అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ భారత్‌ను వెస్టిండీస్ ఓడించలేదు. ఇక్కడ విండీస్‌తో ఆడిన నాలుగు టీ20 మ్యాచ్‌ల్లోనూ టీమ్ఇండియానే గెలిచింది.

**బలంగా విండీస్ బ్యాటింగ్**

గత మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ వెస్టిండీస్ జట్టు మంచి ఫామ్‌లోనే ఉంది. హిట్టర్లతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ భీకరంగా కనిపిస్తోంది. విండీస్ వ్యూహం స్పష్టం. అర్ధభాగం వరకు ఇన్నింగ్స్‌ను చక్కగా నిర్మించడం.. ఆఖరి ఓవర్లలో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడడం ఆ జట్టు అలవాటుగా మార్చుకుంది. ఇదే వ్యూహంతో ఆ జట్టు వరుస విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికాతో ఓడిపోయిన మ్యాచ్‌లోనూ ఆ జట్టు బ్యాటింగ్ లోతు స్పష్టంగా కనిపించింది. 11 ఓవర్లలో 83/7తో నిలిచిన ఆ జట్టు.. ఆ తర్వాత అద్భుతంగా కోలుకుని, 176/8తో ఇన్నింగ్స్‌ను ముగించింది. 9వ స్థానంలో వచ్చిన రొమారియో షెపర్డ్ అజేయ అర్ధశతకం సాధించాడు. హెట్‌మయర్‌ను మూడో స్థానంలో ఆడిస్తుండడం కూడా ఆ జట్టుకు సత్ఫలితాలనిస్తోంది. ఈ నేపథ్యంలో విండీస్ మరోసారి బ్యాటింగే ప్రధాన బలంగా బరిలోకి దిగుతోంది. అయితే ఆ జట్టు కూడా బంతితో పుంజుకోవాల్సివుంది.

**పిచ్ ఎలా ఉందంటే..**

ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. భారీ స్కోర్లు నమోదు కావొచ్చని భావిస్తున్నారు. ఇదే ప్రపంచకప్‌లో ఇక్కడ ఇటలీపై స్కాట్లాండ్ 4 వికెట్లకు 207 పరుగులు చేసింది. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు గంగూలీ పిచ్‌ను పరిశీలించాడు. అతడు పిచ్‌పై సంతృప్తిగా ఉన్నట్లు కనిపించాడని ప్రధాన క్యురేటర్ సుజన్ ముఖర్జీ చెప్పాడు. బౌలర్లకు కూడా కొంత సహకారం లభిస్తుందని అతడు తెలిపాడు. మంచు ప్రభావం ఉంటుందని చెప్పాడు. మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

## టీ20 వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ అవుట్... లంకపై గెలిచినా నిరాశే... సెమీస్ కు న్యూజిలాండ్

**శ్రీలంకపై 5 పరుగుల తేడాతో గెలిచిన పాకిస్థాన్**

**సెమీస్ చేరాలంటే 64 పరుగుల తేడాతో గెలవాల్సిన పరిస్థితి**

**పాక్ ఆశలపై నీళ్లు చల్లిన లంక కెప్టెన్ దాసున్ షనక**

**సాహిబ్జాదా ఫర్హాన్ సూపర్ సెంచరీ వృథా**

**లంక బౌలర్ మధుశంకకు మూడు వికెట్లు**



టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని పాకిస్థాన్ నిరాశతో ముగించింది. శ్రీలంకతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ, పాక్ జట్టు సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకోలేకపోయింది. సెమీస్ చేరాలంటే ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ కనీసం 64 పరుగుల తేడాతో గెలవాల్సి ఉంది. ఆ సమీకరణాన్ని అందుకోవడంలో పాక్ బౌలర్లు విఫలమవడంతో, కేవలం 5 పరుగుల తేడాతో గెలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది. శ్రీలంక బ్యాటర్లు ఆఖరి వరకూ పోరాడి పాక్ ఆశలపై నీళ్లు చల్లారు. దాంతో, మెరుగైన రన్ రేట్ తో ఈ గ్రూప్ నుంచి న్యూజిలాండ్ సెమీస్ చేరింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు సాహిబ్జాదా ఫర్హాన్ (60 బంతుల్లో 100; 9 ఫోర్లు, 5 సిక్సర్లు), ఫకర్ జమాన్ (42 బంతుల్లో 84; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 176 పరుగులు జోడించారు. అయితే చివర్లో లంక బౌలర్లు పుంజుకోవడంతో పాక్ వరుసగా వికెట్లు కోల్పోయింది. అనంతరం, సెమీస్ చేరాలంటే 148 పరుగులకు మించి ఇవ్వకూడదన్న ఒత్తిడితో పాక్ బౌలింగ్ ప్రారంభించింది. లంక బ్యాటర్లు పవన్ రత్నాయకే (37 బంతుల్లో 58), కెప్టెన్ దాసున్ షనక (31 బంతుల్లో 76 నాటౌట్) పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా షనక 8 సిక్సర్లతో పాక్ సెమీస్ ఆశలను ఆవిరి చేశాడు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్ (3/23) రాణించినా ఫలితం లేకపోయింది. చివరకు లంక 207/6 స్కోరు చేయడంతో, పాక్ 5 పరుగులతో గెలిచినా టోర్నీ నుంచి ఇంటిబాట పట్టింది.

# ముందే టీజర్‌లో సీక్వెల్ షాట్స్..కానీ సినిమాలో..



**ఎంత అందం! సారా అర్జున్ తన లేటెస్ట్ ఫోటోలో చాలా అద్భుతంగా ఉంది**



టాలీవుడ్ టు బాలీవుడ్ వరకు ఇప్పుడు సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. పాన్ ఇండియా సినిమాల పరంపరలో క్రేజీ సినిమాలకు సీక్వెల్స్ కూడా అదే స్థాయిలో తెరపైకొస్తున్నాయి. ప్రేక్షకులు కూడా ఈ తరహా మూవీస్‌పై అమితాసక్తిని చూపిస్తుండటంతో మేకర్స్, డైరెక్టర్స్, హీరోలు కూడా సీక్వెల్స్ చేయడానికి ఇష్టపడుతున్నారు. వాటికే ప్రధాన ప్రియారిటీ ఇస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబడుతుండటంతో ఇప్పుడు ఏ భాషలో చూసినా సీక్వెల్స్ గురించే చర్చ జరుగుతోంది. ప్రేక్షకులు క్రేజీ సీక్వెల్స్‌పై ఆసక్తిని చూపిస్తుండటం, ఇవి బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా వసూళ్ల వర్షాన్ని కురిపిస్తుండటంతో డైరెక్టర్ ప్రేక్షకుల్లో మరింత ఇంట్రెస్ట్‌ని క్రియేట్ చేయడం కోసం సరికొత్త జిమ్మిక్కులు చేస్తున్నారు. ఫస్ట్ పార్ట్ రిలీజ్‌కు రెడీ చేస్తూనే దానికి సంబంధించిన టీజర్‌ని రిలీజ్ చేయకుండా ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేస్తున్నారు. పార్ట్ 1కి సంబంధించిన సీన్స్‌ని చూపించకుండానే పార్ట్ 2 సీన్స్‌తో టీజర్‌లని కట్ చేస్తూ సీక్వెల్స్‌పై అంచనాలు పెంచేస్తున్నారు. ఈ ఫార్ములాకు ముందు శ్రీకారం చుట్టిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ఆయన తెరకెక్కించి హైవోల్టేజ్ యాక్షన్ డ్రామా -సలార్-. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటించిన ఈ మూవీకి సీక్వెల్‌గా -సలార్ 2-ని కూడా ప్లాన్ చేయడం తెలిసిందే. అయితే సినిమాపై హైప్‌ని పెంచడం కోసం -సలార్-కు సంబంధించిన టీజర్‌ని విడుదల చేసి సరికొత్త స్ట్రాటజీకి తెరలేపిన విషయం తెలిసిందే. క్యారెక్టర్ ఆర్టిస్ట్ టీనూ ఆనంద్ -సింపుల్ ఇంగ్లీష్..లయన్, చీతా, టైగర్, ఎలిఫెంట్..వెరీ డేంజరస్...బట్..నాట్ ఇన్ జురాసిక్ పార్క్, బికాజ్ ఇన్ దట్ పార్క్ దేర్ ఈజ్ ఏ.. అంటూ పార్ట్ 2కి సంబంధించిన సీన్‌ని చూపించి సినిమాపై హైప్ పెంచేశాడు. -సలార్-లో ఈ సీన్ లేకపోవడంతో ఫ్యాన్స్ చాలా వరకు నిరుత్సాహానికి గురయ్యారు. ఇదే ఫార్ములాని డైరెక్టర్ సుకుమార్ -పుష్ప- కోసం ఫాలో అయ్యాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా లెక్కల మాస్టారు తెరకెక్కించిన పాన్ ఇండియా వండర్ -పుష్ప-. దీనికి సీక్వెల్‌గా -పుష్ప 2-ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే సినిమాపై హైప్‌ని పెంచడం కోసం డైరెక్టర్ సుకుమాక్ పార్ట్ 3 -పుష్ప :ది ర్యాంపేజ్-కు సంబంధించిన టీజర్‌ని విడుదల చేసిన హైప్ క్రియేట్ చేశాడు. బన్నీ ముసుగు ధరించి పోలీసులుకు దొరక్కుండా తప్పిచుకుని తిరుగుతూ కనిపించడం, ఈ వార్తలు జోరుగా టీవీల్లో ప్రసారం చేయడం..అది చూసి జనం -పుష్ప- కోసం మదనపడటం.. అడవిలో చిరుతకు ఎదురుపడటం, బన్నీ కోసం ఊరూరా పోలీసులు గాలిస్తున్నట్టుగా చూపించడం తెలిసిందే. ఈ సీన్‌లేవీ -పుష్ప2-లో లేవు. -పుష్ప 3-కి సంబంధించిన సీన్‌లు అని -పుష్ప 2- రిలీజ్ తరువాత అందరికి క్లారిటీ వచ్చింది. ఇప్పుడు ఇదే స్ట్రాటజీని బాలీవుడ్ మూవీ -ధురంధర్- కోసం ఉపయోగించాడు డైరెక్టర్ ఆదిత్యధర్. పార్ట్ 1 రిలీజ్ టైమ్‌లో రిలీజ్ చేసిన టీజర్‌లో -ధురంధర్ 2:ది రివేంజ్-కి సంబంధించిన హార్డ్ కోర్ యాక్షన్ సీన్స్‌ని చూపించడంతో సినిమాపై సహజంగానే హైప్ క్రియేట్ అయింది. అయితే పార్ట్ 1లో టీజర్లో చూపించిన సన్నివేశాల్లో చాలా వరకు కనిపించకపోవడంతో పార్ట్ 2లో వీటిని చూపిస్తారని తేలడంతో ఇప్పుడు అంతా -ధురంధర్ 2:ది రివేంజ్- కోసం ఎదురు చూస్తున్నారు. ఇలా సీక్వెల్స్‌పై క్రేజ్‌ని క్రియేట్ చేయడం కోసం డైరెక్టర్స్ ఎంచుకున్న కొత్త ఫార్ములా మంచి ఫలితాలని అందిస్తుండటంతో రానున్న రోజుల్లో మరి కొంత మంది దర్శకులు సీక్వెల్స్ కోసం ఇదే ఫార్ములాని ఫాలో కావడం ఖాయం.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com